

# ఆర్గురు శత్రువులు

''అంతశ్శత్రువులను గెలవాలి. నీకు శత్రువు హరి గాదు. నీ శత్రువు నీ లోపలే ఉన్నాడు'' సౌమ్యంగా నవ్వుతూ ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యకశిపునికి చెప్పాడు.

తండ్రి కర్థంగాలేదో లేక, అంతశ్శత్రువులను జయించలేక పోయాడో తెలియదు. ఆర్గురు శత్రువులూ హిరణ్యకశిపుని ఓడించారు. ఆశ్చర్యపోయి, ఆర్గురూ ఒక రూపంగా మారి వచ్చిన వానిని చూచి ''కేవల నరరూపముగాదు, కేవల మృగరూపము గాదు, నన్ను జయించటానికె వచ్చాడీ వింత మృగం'' అనుకున్నాడు.

గొప్ప కవి ఫిలాసఫర్, ''మృగంలాగా తయారైన హిరణ్యకశిపుని చంపటానికి హరి తానూ సగం మృగరూపం యెత్తాల్సి వచ్చింది. లేకపోతే చంపలేడు'' అన్నాడు చమత్కారంగా.

అనసూయ హిరణ్యకశిపుని లాగే ఘోరతపస్సు, చేసి వరాలు పొంది వుండాలి. సహజ సౌందర్యం, తెలివితేటలు, చొరవా, సాహసం, నిర్భయం, తీయని గొంతు, వితరణ గుణం, సూక్ష్మ బుద్ధి కలిగి భూమ్మీద పడింది. పడగానే మూడు గుణాలు, ఆర్గురు శత్రువులు పట్టేస్తారుట. అందుకే శిశువు కెవ్వుమని యేడుస్తుందిట. పంచభూతాత్మకమైన శరీరంలో అది శబ్దంగా వచ్చునేమో గాని ''యెందుకు భూమ్మీద పడేశావురా భగవంతుడా!'' అనే కేక అది అని ఒక ఫిలాసఫర్ చమత్కరించాడు.

లావణ్యం, కారుణ్యం అలుముకొని, ముక్కు మూరెడూ సిగబారెడూ అనే సామెత నిజం చేస్తూ అత్తింట్లో అడుగు పెట్టింది అనసూయ. ఆడదానికి కొప్పే అందమన్నారు. జుట్టు గిరి చేతులెత్తి జుట్టుని ముంతంత కొప్పులాగా చేస్తుంటే, బంగినపల్లి మామిడి పండు రంగులో ఉండి, యెముకలు కనబడని బొద్దైన మరదలిని బావగారు కన్నార్పకుండా చూచేవాడు. పని చెపితే తలూపుతూ ''చేస్తా'' అంటుంది. కొప్పూ కదులుతుంది విలాసంగా. అయిదొందలేళ్ల కిందట చేమకూర వెంకటరాజకవి 'విజయ విలాస'మనే శృంగార కావ్యం అల్లాడు. సుభద్ర అందం క్రయాలంకారం వేసి వర్ణించాడు. సుభద్ర, మాయావతి రూపంలో వున్న బావ అర్జునిని బిక్ష తెచ్చి యెదురుగా నిలబడింది. ఆ తీరుచూసి మోహపడ్డాడర్జునుడు. 'నిక్కెడు నీల్గెడు విర్రవీగెడున్' అన్నట్లు సుభద్ర నడుము సన్నసై పిల్ల తీగలాగా పొడుగైతే ఆమె జుట్టు ముడి గర్వంగా కదిలిందట. అదీ సోయగం.

యెస్సెస్సీ చాలునని తండ్రి మేనరికమిచ్చాడు. పాడీ పంటా వున్నాయి అత్తవారికి. ఆవు వెనక కాళ్లకి బంధం వేసి దూడను వదిలి, పాలు చేపుకి రాగానే దూడను కట్టేసి, ముక్కాలి పీట మీద కూచుని గిన్నెడు పాలు అలాగ్గా తీసి, బంధం తీసి దూడను వదిలేది. అలానాయిగావుల పాలు తీసి పాలగిన్నెలు తట్టలో పెట్టి ఆవుశాలనుంచి పడమిటింటిలోకి నడిచి వస్తుంటే, ఆ వయ్యారం, కులుకూ బావగారి మతి పోగొట్టేవి. ఆయన భార్యకి ఆస్త్మా. డొక్కులాగా వుంటుంది. ఆయన కూతుళ్లిద్దరూ అనసూయ యీడు వాళ్లే. కొడుక్కి పదోయేడు. అన్నదమ్ముల వయస్సులో బాగా తేడా వున్నది. ఇల్లు చిమ్మి అలికి ముగ్గు పెట్టేది. తల ముడేసుకొని బావి అంచున తాగాడి మీద రెండో పాదముంచి వంగి నీళ్లు తోడేది. తొట్టు, గాబులు, కుండలు, బిందెలూ నిండేవి. తర్వాత బోరింగ్ పంపు

కొట్టి, నీళ్లు పట్టి గుడ్డలుతికి ఆరేసి, స్నానం చేసి మంచి నీళ్ల బిందెలింట్లో పెట్టేది.

బాదంకాయ ఆకారంలో వున్న వెండి పళ్లెంలో దంపుడు బియ్యవన్నం వెట్టి, పల్ల గోంగూర పచ్చడి, వెన్న, పేరిన నెయ్యి, మీగడ పెరుగు వడ్డించి మొగుడికి కడుపునిండా అన్నం పెట్టేది. చొక్కా ధోవతి అందిస్తే పట్టు ధోవతీకి బదులుగా మిల్లు ధోవతీ కట్టి చొక్కా వేసుకుని పొలం బోయేవాడు మగడు జనార్ధనం. తెగ బారెడు జడ వేసుకుని, పిల్లల్ని అలంకరించి తిండిపెట్టి బడికి తోలేది. తర్వాత వెండి పళ్లెంలో అన్నం పెట్టుకుని కావాల్సిన వూరగాయా నెయ్యి పెరుగుతో కడుపునిండా తినేది. అత్తగారికి సాయం. తోడుకోడలికి సేవ. యేమేమి బాగుచేయాలో చూసి బాగుచేసేది.

2

యెవర్ని చూసినా అందమైన మొగుడూ, అనుకూలతా, అతడు పట్నం వెళ్లితే వచ్చేప్పుడు, మంచి దువ్వెనా వాసన నూనె, అద్దం, రిబ్బన్లు, రెడిమేడ్ జాకట్లూ, ఫుల్ వాయిల్ చీరా తెస్తే, పెళ్లాం గర్వంగా చూపేది యిరుగు పొరుగువారికి.

''మా నాన్న నన్ను బైతుకిచ్చాడేం. సరసం లేదు. ముద్దులూ మురిపాలు, అలకలు, ప్రణయ కలహం లేవు. వున్నవల్లా జారిపడే మట్టి రోడ్లూ బురదా, గట్టు వెంబడి వెళ్లి అన్నం తినిపించి రావాలి. అంతా తిని వేళ్లు నాకి త్రేనుస్తాడు. పదార్ధాలు బాగున్నాయనడు. ఓ ముద్ద నోటి కందించడు. అక్కడెవరూ లేరని గమనించి చెయ్యిపట్టుకోడు'' అనుకుంటుంది అనసూయ.

అక్కకు ఒంట్లో బాగా లేదని వార్త అందితే పట్నం వెళ్లిందనసూయ.

భోజనాల గదిలోంచి చూస్తే పడగ్గదిలోవారు కనిపిస్తారు.

రాజేంద్ర బావ పడగ్గదిలో, మంచం మీదున్న అక్కతో అనటం వినబడి నవ్వుకున్నది అనసూయ. అక్క పేరు సుజాత.

''సుజీ! నువ్వు నీ మరిది జనార్ధనానికిగానీ, అత్త అన్నపూర్ణమ్మకి గానీ, నీ చెల్లెల్ని పంమని కార్డు పడేశావాయేం?''

''నేవ్రాయలేదండీ. బహుశా విశాల పిన్ని వెళ్లి చెప్పి వుంటుంది. ఆమె కోడలుదావూరే. నోము నోయించాలని వెళ్లి నా చెల్లిని చూసి చెప్పి వుంటుంది. యేం? యేంచేసిందేం?''

బావ తనను బాగా గమనించాడని సంతోషించింది అనసూయ.

''అది అనవసరం. నీకు డయిబెటిక్ వచ్చి వుండాలనీ, కళ్ల జబ్బు దానివల్లేననీ కంటి డాక్టరు ఫోన్ చేశాడట. స్పెషలిష్టు టెస్టు చేయించమని ఫోన్ చేశాడు. అదే నిజమైతే, తీపి తినరాదు, అన్నం తగ్గించాలి డయిట్ చూసుకోవాలి. మజ్జిగ, పండురసం యెక్కువ తీసుకోవచ్చు. రేపు టెస్టుకి వెళ్దాము. యెల్లుండి కంటి అద్దాలు యిస్తాడు షాప్ కీపర్. అమ్మగార్ని తీసుకురండి.'' అని చెప్పాడు.

బావ బీరువాకున్న అద్దం ముందు నిలబడి తలదువ్వుకుని, టై సర్దుకున్నాడు. ఇటు తిరిగాడు. యేమి అందం. యేమి ఠీవి ఆ యూనిఫామ్ యెంత అందమిచ్చిందో. అక్కంటే యెంత ప్రేమో. నాకూ వున్నాడు మగడు. నేను పడకవేస్తే, పలకరించకపోగా వుడకేయటానికి సంబరపడతాడు. కాలు జారిపడి వాపు వచ్చింది. తల్లీ పడక వేసింది. అందరికీ వంట చేసి వెండిపళ్లెంలో వడ్డించాడు జనార్ధనం మగడు.'' బావ అంటున్నాడు ''పంపించేయనా సుజీ.''

నవ్వుకున్నది అనసూయ తనను అనూ అని పిలవమని చెప్తే వినిపించుకోడు ''యేమేవ్!'' అని పొలికేక పెడతాడెదుట లేకపోతే, పరుగెత్తుకొచ్చి యెదుట నిలబడుతుంది తాను.

''యేం చేసిందేం? అదే వెళ్తుంది. పసిబిడ్డ నొదిలి వచ్చింది. పోతపాలు కావు బిడ్డకి'' అంటున్నది అక్క సుజాత.

''అదే నేనూ అంటున్నా. పాలుతాగే కూననెట్లా వదిలి వచ్చిందసలూ? అన్న ప్రాశన కాలేదన్నదే అడిగితే. కులుకూ, వయ్యారం అర్థంలేని నవ్వూ. ఇంట్లో జమాన్లు తిరుగుతారు. బ్లౌజ్ లేకుండా వంట యింట్లో వంటా, డైనింగ్ టేబిల్ వద్ద వడ్డనా. మర్యాదగా వుండలేక అవస్థగా వున్నది సుజీ'' అంటూ రూమ్ వాకిలి వేపు వెళ్లాడు.

సుజాత మెల్లిగా అన్నది ''దానికి హిస్టీరియా వున్నది. నాన్న కంట్రోల్ చేసేవాడు. దాని క్లాసుమేట్సు వెంట వచ్చినపుడు, క్లాసులో యెలా మాట్లాడుతుందో యెలా బిహేవ్ చేస్తుందో చెప్పి నవ్వేవారు. నాన్న మళ్లా డాక్టర్ని సంప్రదించాడు. ''అది ప్రమాదకరం గాదు. హెరిడిటరీ.'' అన్నాడు డాక్టరు. ''యెవరివైపూ లేదండీ.'' అన్నాడు నాన్న. ''అంతకు ముందు తరాలలో వున్నా వస్తుంది.'' అన్నాడు డాక్టరు.''

నువ్వు కనిబెట్టి వుండు. బాత్ తలుపు వేసుకోవాలని చెప్పు. చీరతోనే స్నానం చేయమను.'' మంచంమీద కూచుని లేసులు బిగించుకుంటూ అన్నాడు రాజేంద్ర.

వచ్చేస్తున్నాడని అనసూయ వరండాలోకి వెళ్లిపోయి నవ్వుకున్నది.

కథా నిలయం
5247
శ్రీకాకుళం

''బాగానే గమనించాడు నన్ను'' అనుకున్నది.

3

సుజాతకు యిబ్బంది కలగరాదన్నట్టు అనసూయ బావగారు రఘురామయ్య వచ్చాడు. భోజనాలయాక అన్నాడు.

''అనసూయ వున్మాదించినట్లు హడావుడిగా బయలుదేరి వచ్చిందమ్మా సుజాతా. పిల్లవాడు పోతపాలు పడక జబ్బు పడ్డాడు. తాగడు. తాగటం రాదు. ధారకం సరిగా అందక నీరసించి మంచంలో పడుకుని కళ్లు తిప్పుతూ తల్లికోసం చూస్తున్నాడు. నేనీవూరు కోర్టు పనిమీద వచ్చాను. అమ్మ చెప్పి పంపింది'' అనసూయను తీసుకురా. ఓ జతగుడ్డలు సంచీలో కూరి పరుగెత్తికెళ్లి రైలందుకున్నది. ఈ పాటికి సుజాత లేచి తిరుగుతూ వుండాలి.'' నీ కిబ్బందా సుజాతా?'' అన్నాడు ఫార్మల్‌గా. పళ్లబుట్ట గోడవారగా పెట్టి కుర్చీలో కూచున్నాడు.

''నా కిబ్బంది లేదు. ఆయనొచ్చి సాయంత్రం రైలెక్కిస్తారు. టికెట్లు కొన్నానని ఫోన్ చేశారు. యెండనబడి వచ్చారు. ఇపుడేగా భోజనమైందీ. కాసేపు నిద్ర తీస్తే బడలిక తగ్గుతుంది'' అన్నది.

రాజేంద్ర వూపిరి తీసుకున్నాడు. తోడల్లుడి అన్నే వచ్చాడు. దేముడల్లే మరదలు సైకోని తీసుకెళ్తున్నాడు. రాజేంద్ర పైకి అనడు. వెలితి మాటలు మాట్లాడడు. నిండు కుండలాగా వుంటాడు.

సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు లేవు నించోవాలిద్దరూ. రాత్రికో రైలులో బెర్త్స్ దొరికినై. కాని రైలు లేటు.

''భోజనాలు కానిచ్చే తీరిగ్గా వెళ్లచ్చు అన్నగారూ'' అన్నాడు రాజేంద్ర. భార్యచేత ఆమె చెల్లెలికి మంచి చీరా బ్లౌజ్‌పీస్ పెట్టించాడు. రైలు ఖర్చులకి బాధపడలేదు.

''బావ నాకీ చీర పెట్టాడు. చాలా ఖరీదు. ఈ చీరలో నేను మరీ బావున్నా గదూ! నేను కట్టితే చీరకే అందమొచ్చిందన్నాడు బావ'' యెదురుగా నిలబడి కదుల్తూ అన్నది అనసూయ. పమిటి బుజం మీదనించి మెలితిప్పి ముందుకు తెచ్చి పట్టుకుని వయ్యారాలు ఒలకబోస్తు వెళ్తూ అన్నది, ''బావకి నేనంటే ప్రేమ''. డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిలబడి వెనక్కు తల తిప్పి చూసుకుంటూ, జడముందుకేసుకుని అద్దంలో చూసుకున్నది.

రైలు పెట్టెలో కిక్కిరిసిన పాసింజర్సును చూసి సంతోషించింది. బావగారి పక్కన కూచుని, చేయి బైటికి జాపి, ప్లాట్‌ఫామ్ మీద నిలబడి వున్న బావని చూసింది. సంపెంగ పూలు అరటి దొన్నెలో కట్టి వున్నవి కొనిచ్చాడు రాజేంద్ర. అరటిపళ్ల అత్తం బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చాడు. రెండు తెలుగు పత్రికలు, చంద్రిక, వినోదిని కొనిచ్చాడు.

''వమా అక్కదే అదృష్టవంటే బావా! వుద్యోగీ, అందగాడు, అనుకూలుడు, సరసుడు, మగడుగా వచ్చాడు. నాకూ వచ్చాడు మగడు చెప్పుకోటానికేమున్నది?'' అన్నది అనసూయ.

రాజేంద్ర రఘురామయ్య వంక చూశాడు. చేతులు వెనక పెట్టుకు నిలబడి అనసూయతో అన్నాడు.

''అలా జెలసీ పెరగనివ్వరాదనసూయా. అది ఆరోగ్యకరం గాదు. నాకు

రెక్కలే ఆధారం. రెక్కాడితేగాని డొక్కాడదు. మరో డ్రా బాక్. మేము తొమ్మిదిమందిమి తోడబుట్టిన వాళ్లం. నేను పెద్దన్నను. తక్కిన వాళ్లకు రెక్కలొచ్చేదాకా, లైఫ్‌లో స్థిరపడేదాకా ఆదుకుంటూనే వుండాలి నేను. అది నీకు అసంతృప్తి కలిగించి ''యిదేం మొగుడు సంపాదనంతా వాళ్ల వాళ్లకే చెందుతున్నది'' అనుకుంటావు. బంగారమంటి మాగాణీ, చిక్కని పాలిచ్చే గోమాతలు ముద్దు చేసే అత్తయ్య మామగారూ మంచి తిండీ వున్నాయి నీకు. పట్నవాసమేగానీ అన్నీ కల్తీయే. ప్రేమాభిమానాలు, పైరుగాలీ, ఆప్యాయతాయేవీ అనసూయా?''

''అనూ అని పిలు బావా'' అంటుండగా రైలు కదిలిపోయింది. రాజేంద్ర చేయి వూపుతూ కనిపించాడు.

## 4

''యేం పిన్నిగారూ! దిగాలబడి భావి బొడ్డు కానుక్కూచున్నారేం? అనసూయ ఆఫీసునించి యింకా రాలేదా యివాళ? వస్తుంది. కళ్లల్లో వత్తులేసుక్కూచుంటారెందుకూ? కూతురు మిమ్మల్ని మన్నిస్తున్నది గనకనా. విరగబాటూ, విరాళింపూ, అదిరిపాటూ, దాష్టీకం యీసడించటం మీరు గాంగా భరిస్తున్నారు. నేనైతే తాటి చీపిరి తిరగేసి మడమతో వీపు చీరేదాన్ని. డాక్టర్ చేత స్టెరిలైజ్ చేయించి మానసిక వికాస కేంద్రంలో చేర్పించేదాన్ని. సహనం వల్ల లాభం లేనప్పుడంతే'' అన్నది భాను. భాను జానికమ్మ పెద్దతోడుకోడలు పెద్ద కూతురు. పెద్ద తోడు కోడలు రాధమ్మ మొగుడు పోతే యేడుస్తూ కూచోక పరీక్షలు పాసై స్కూళ్ల యిన్‌స్పెక్ట్రస్ అయింది. ఇద్దరాడపిల్లలు గ్రాడ్యుయేట్స్ కాగానే పెళ్లిళ్లు చేసేసింది. అంపకాలు పెట్టి ''మరీ ఆపదలొస్తే డైవోర్సుకు వెరవకండి. జాబ్స్

తెచ్చుకోండి. అదీ నీతి. అదే జీవితం''. ఒక కూతురు అల్లుడు కంప్యూటర్ సైన్సెస్ పాసై స్టేట్స్‌కి వెళ్లారు. రెండో కూతురు అల్లుడు టీచర్లుగా కెనడాలో స్థిరపడ్డారు. గ్రీష్మంలో వెళ్లి చూసొస్తువుంటుంది రాధమ్మ. జీవితమే ఒకసర్కస్ అంటుంది రాధమ్మ.

''కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందన్నట్టు, యేమి యెట్లా చెప్పాలో తెలియటం లేదు.'' అని కళ్లు వత్తుకున్నది.

''బావ యెందుకరెస్టయినాడసలు?'' పిన్ని ఒక్క పొద్దుంటుందని భాను తాను చేసి ఫలహారం యెండాకుల్లో పొట్లం కట్టి ప్లాస్టిక్ సంచీలో పెట్టి తెచ్చింది. అమృతపాణి అరటిపళ్లు ''తల్లినెట్లా చూడాలో నీకు తెలుసమ్మా. చదవేస్తే వున్న మతి పోయిందని సామెత. అనసూయ పరీక్షలు పాసుకాకముందే నయం. డాక్టరూ బంధువులూ నాతో యేకీభవించరు. అనసూయ చిన్నప్పటినించీ అంతే అంటారు. ఇప్పుడే నేను గ్రహిస్తున్నానట. అల్లుడా! వాళ్లెవరో అన్నలుట అదీ కాకపో పిడబ్ల్యుటి లాగా చెప్పుకుంటున్న నకిలీ గ్రూపుట. వారికి డబ్బూ, ఆయుధాలు చాటుగా అందిస్తున్నాడనీ గుళ్లో పేలుడులో పాల్గొన్నాడనీ అరెస్టయినాడు. అది పెద్దనిందేమో. నేను నమ్మలేదు. అల్లుడు మేధకుడు. మనిషిని పోలిన మనిషిని పట్టారేమో ననుకున్నా. దౌర్జన్యకాండలో పాల్గొని పారిపోతుంటే పేల్చేశారట పోలీసులు. మనిషే దొరకలేదు. అదె పెద్ద విచిత్రం.'' అని కూనిరాగంలోంచి శోకంలోకి పోయింది.

''తునాతునకాలైనాడేమో. బాంబులు విసిరారని అన్నది మా అమ్మ.''

''యేమో అంతా కలా మాయా, ఇంద్రజాలమా తెలియదు. బోనులో నిలబడిన మనిషిని అల్లుని లాగా వున్నవానిని'' అయుధాలేం చేశావు. పోలీస్

స్టేషన్నించి యెత్తుకు పోవటానికి సహాయపడిందెవరు?'' అంటే తలెత్తి సమాధానమివ్వలేదు. నడిపించుకెళ్లారు.''

''కొడుకెందుకు పోయాడు?'' అనడిగింది మెల్లిగా.

''అదింకా ఘోరం భానూ. నీకాపేక్షవుంది అవన్నీ అడుగుతున్నావు. కిషోర్ జనముద్దయిన బిడ్డ. వూరి వారంతా ముద్దు చేసేవారు. ఆరోగ్యంగా బలంగా పెరిగిన బిడ్డకి నాలుగోయేడొచ్చింది. నలతగా కనిపించాడు. తిండి చాలా వరకు తినలేక పారేసేవాడు. డాక్టరుకు చూపితే లివరు వ్యాధి వచ్చిందన్నాడు. మందు దోవ మందుది, వ్యాధి దోవ వ్యాధిదీ అయి ముదిరింది. బతకని బిడ్డ చారెడని ఆరేళ్ల బిడ్డలాగా యెదిగి పెద్దవాళ్లలాగా మాట్లాడాడు. నల్లని జుట్టు వుంగరాలు తిరిగి బుజాలు దిగింది. దువ్వి ముడేసేవాళ్లం. పెద్దపట్నమే తీసికెళ్లి స్పెషలిస్టుకి చూపావు.'' అది లివరు కాదు అలా కనబడుతుంది. లివరు కింద మరోటుంటుంది. అది జీర్ణశక్తిని కాపాడుతుంది. అన్నీ విడదీసి శరీరభాగాల కందిస్తుంది. అది పాడైపోయింది. ఆ శక్తిలేదిప్పుడు బిడ్డకి మందులు పనిచేయవు.'' అన్నాడు.

''బిడ్డ అవస్థ చూడలేకపోతున్నా డాక్టర్. యెత్తలేకపోతున్నాం.'' అంటే ''అయిపోయింది రోజుల్లో కొచ్చేసింది.'' అని లేచిపోయాడు డాక్టరు.'' వెక్కిళ్లు పెట్టింది పిన్ని.

'' ఆస్తి వుండెగా. వుద్యోగమెందుకు చేస్తున్నాదీ అక్క ?''

''కాల మహిమ. వుద్యోగం చేయలేవు అంటే విన్నదిగాదు. ఆస్తి తగాదాలలో వున్నది. బావగారేమో తమ్ముడిని విడిపించి యింటికి తేవాలని, పొలాలమ్మి ఖర్చుచేశానంటాడు. అదేదో స్టాక్ మార్కెటా, ఎక్సేంజా నాకు

తెలియదు, అదంతా వీధి కెక్కి పైవారే తీసివేయబడి, అరెస్టయి కేసుల్లో వున్నారట. దాంట్లో కోల్పోయాడు బావగారు. నాకు వివరాలూ తెలియవు చెప్పటమూ రాదు. నేనే నాకూతురుకేమైనా దక్కుతుందేమోనని వెంపరలాడి లాయర్ల చుట్టూ తిరిగాను. కన్నకడుపుగదూ. దానికే చింతాలేదు చీకూ లేదు. మొగుడు మాయమైన యాడాదికే బిడ్డనూ కోల్పోయింది. అవేవో పరీక్షలు పాసై వుద్యోగం తెచ్చుకున్నది అదీ దిలాసా.''

''యేం వుద్యోగమది?''

''దాన్నే అడుగు. ఇంట్లో వుండటం తక్కువే. వచ్చింది మొదలుకొని ధూము ధాములు చేస్తుంది'' విసుగ్గా అన్నది పిన్ని.

''నీవు గమనించలేదేమో పిన్నీ. అక్క చేతులో చాలా డబ్బు తిరుగుతున్నది పిన్నీ. ధనమొచ్చిన మదమొచ్చును, మదమొచ్చిన మత్సరంబు మానక హెచ్చున్ అన్నారు కవులు. మళ్లా పెళ్లి తలపెట్టదూ. పోనీ బోయ్ ఫ్రెండన్నా తారసపడలేదూ. కాలం మారిందిగా. కంప్యూటర్ యుగంలోకొచ్చేశాం. పాతికేళ్లే. మిస మిస, వయ్యారం, కులుకు అలాగే వున్నాయే.''

''యేమో వున్నాడేమో. విదేశం వెళ్తానంటున్నది. మీరిద్దరూ వెళ్లారు గదూ'' యెటో చూస్తూ అన్నది. బాగా చీకటి కమ్ముకున్నది.

3

రమ యేడ్చి కళ్లు తుడుచుకుని చల్లని నీళ్లతో మొహం కడుక్కుని, సబ్బుతో మొహం రుద్ది కడిగి మళ్లా చన్నీళ్లతో కడిగింది. గదిలోకి పోయి కాగితం పొట్లాం విప్పి చిటికెడు ఫేసుపౌడరు తీసి అరచేతులలో వేసుకుని మొహానికి అరచేతులు

రుద్దింది. పమిటతో మొహం తుడుచుకున్నది. బొట్టు బిళ్ల పెట్టుకున్నది.

''నీకు సబ్బెందుకే రమా. ఫేసుపౌడరద్దితే తెల్లబడతావా? యెలుక తోలు తెచ్చి యెంతగా వుదికినా నలుపు నలుపే గాని తెలుపు గాదు'' పకపకా నవ్వింది అనసూయ.

గదిలోంచి పరుగుదీసింది రమ చెల్లెలు.

## 4

''మీ అక్క అనసూయ ఆర్గురు శత్రువులకు చిక్కిందోయ్ శాస్త్రీ. వదిలించుకోమను. డాక్టర్ని సంప్రదిద్దాం అనుకోరూ మీలో యెవరూ. మానియాయేమో. ఉద్యోగానికి తిలోదకాలిచ్చి కావాల్సినంత తీరుబాటు సంపాయించారు అక్కగారు. నువ్వు శ్రద్ధగా చెప్పి పాస్ అయేట్టు చూస్తావని ట్యూషన్ను యేర్పాటు చేసి యింటికి పంపిస్తే, యింటికెవరూ రాకూడదనేమో దూషించి, వెక్కిరించి రాకుండా తరిమేస్తున్నారు. ఈసూ అసూయా లోభమూ మహా అపకారం చేస్తాయి. దేవకన్యలాగా, అప్సరసలాగా వుంటే యెవడూ మోహించి కాళ్లు పట్టుకుని పెళ్లాడమని అడగడని ఫ్రస్టేషనేమో. ఒక్కమాట హాస్యానికన్నా పడలేరు చూశా ప్రాక్టికల్‌గా. తారాపథానికి తెస్తారు. మొహమంతా కందగడ్డలాగా అయి క్రోధమిలా వుంటుందని పదునైన భాష వాడతారు'' అంటున్నాడు సచ్చిదానంద శర్మ. ఆరుబయట రాతి అరుగుమీదున్నారు. పబ్లిక్ పార్కులో మూలగా వున్నదా అరుగు. దూరదర్శన్ వార్తా ప్రసారం చేస్తున్నది. పొద్దూకింది. పిల్లలు ఆడుతూ అరుస్తున్నారు.

''తెలిసిందే చెపుతున్నావు మిత్రమా. తను బాగుపడదు యెదుటివారిని బాగుపడనీయదు. బలంగా ధృడంగా వున్నా ఒక్క పని అందుకోదు. ప్రతీ దానికీ

గేలిచేస్తుంది లేదా తప్పుపడుతుంది. చెల్లెలు ఆవకాయ పెట్టటం నేర్చుకోవాలని అన్నీ సమకూర్చి కొద్దిగా పెట్టింది.'' నిమ్మకాయలు తెచ్చి ఆవకాయ వేశారేమో ఇంత పుల్లని మామిడి కాయలెక్కడ దొరికాయీ?'' అన్నదిగానీ వూరగాయీ అన్నం తినేసింది. రకరకాల వడియాలు పెట్టటం నేర్చింది చెల్లెలు. అవి వేయించి వేస్తే కరకరానమిలి తింటూనే, ''కూరల్లో వేసుకుంటారే రమా. కూరలు ఖర్చు తగ్గించాలని పెట్టావా? పీనాసీ లేకపోతే వడియాల ప్యాకట్లు తయారుచేసి షాపుల్లో యిచ్చి అమ్మి పెట్టమని చెప్పి వస్తావా? ఫిఫ్టీ ఫిఫ్టీ అని చెపుతావా చేతులెంత బాగా ఆడిస్తుందో నోరు అంతకంటె బాగా ఝూడిస్తుంది. బజారునించి, దానిమ్మ పళ్లు, యాపిల్, పచ్చి కిస్‌మిస్ ద్రాక్ష తెస్తానని యెదురు చూస్తుంటే, యెండు మిరపకాయలూ, చామా, కందా తెచ్చి యెదురుగా పెడ్తానుట'' అంటున్నాడు తలవంచుకుని. మిత్రుడు నవ్వుతున్నాడు.

''మీదకి విసిరేసింది చామదుంపలు. చదువుకోనివ్వదు. ఇదుగో యీ డిగ్రీ కోర్సు నైట్ కాలేజీలో పూర్తిచేసి వెళ్లిపోవాలని తమాయించుకుంటున్నా. అమ్మేమో 'పెళ్లి సంబంధాలొస్తున్నాయి. యేదో ఒకటి నిశ్చయిస్తా. వేరు కాపురం వెలిగిద్దువుగాని'' అన్నది. చెల్లెల్ని మరీ అవమానిస్తున్నదని చూసి, అమ్మే చెల్లెల్ని తీసికెళ్లి మరోవూళ్లో వుంచింది. అక్కడికీ వెళ్లింది అనసూయ అక్క. చెల్లెలు దారిలేక భయపడి తాళంపెట్టి పక్కింట్లో దాకున్నదట. బావ రాలేదింకా రావాలి'' అన్నాడు శాస్త్రి.

''యెందుకలా మన్నించాలీ? గట్టి కారణముండాలి'' అన్నాడు సచ్చిదానంద శర్మ.

''వున్నది. ఆస్తిలో వాటా కోసం దావాలాడి గెల్చింది అమ్మ. మేడా

భూములూ వచ్చాయి అక్కకి. అవి చేయి జారిపోకుండా చూడాలంటే, వాటి ఓనరు పక్షమే మాట్లాడాలి.''

''కాని శాస్త్రీ మీ అక్క ట్రై చేస్తే, దైవం అనుకూలిస్తాడు. గెలుస్తుంది. అర్గురు శత్రువులను తరిమేస్తుంది. హిప్నోథెరపీ వచ్చింది. మీరెవరూ వినలేదా''?

''ప్రహ్లాదుడు తన తండ్రికి హిప్నోథెరపీయే అప్లై చేశాడు. యేపాటి లాభించిందో నా కర్థంగాలేదు నయమైందా? వాడి కచ్ఛగూడా మానియా కిందికే వస్తుందా? హిరణ్యకశిపునికి చెల్లెలు లేదేమో. కాని మా అక్క కున్నది. ఈసు అసూయా యిలా వుంటాయా అన్నట్లు అభినయిస్తూ అంటుంది చెల్లెల్ని''.

''యెక్కడో దుబాయ్‌లోనో, కువ్వయ్యత్‌లోనో, గల్ఫ్ దేశంలోనో వున్న వాడి కోసమె యింత అలంకారం. గుళ్లో పెళ్లిలాటిది చేసుకున్నాడంతేగా. దండలు మార్చుకుంటే చాలన్నాడంతేనా? సంగీతం నేర్చుకోమని డబ్బు పంపుతున్నాడా దుబాయ్‌లో దూరదర్శన్‌లో ప్రోగ్రామిప్పిస్తాడా? అంత పరపతి వున్నదీ? డాన్సుగూడా నేర్చుకోమనలేదూ. డాన్సుగూడా నేరిస్తే తెయ్‌మని మొగుడెదుట గెంతవచ్చు. నిన్ను వరించి స్వయంవరం చేసుకోలేదు గోపీ. ఆపద్ధర్మం కింద, వాళ్లవాళ్లు తెచ్చిన యిల్లరికం వెళ్లేసంబంధం తిప్పేయాలని నిన్ను వాటేసుకున్నాడు. పెళ్లాడానని టామ్ టామ్ వేశాడు. ఓకే. కీర్తన యెన్నాళ్లు నేర్పుతాడే మేష్టరూ రమా.'' అడించేవు సుమా'' అని ఓ పక్షం నించీ అరుస్తున్నాడు. నాకూ నేర్పమని అడిగితే నీలుక్కు పోయాడు నీ బోడి మేష్టరు.'' అన్నది నిలబడి

''నువ్వు మరీ పదినోటు వాడి మొహాన విసిరేస్తే అవమానమన్నాడు. వూరికేనన్నా చెప్తాగాని పది తీసుకోనని అక్కడే వదిలేసి వెళ్లాడు.'' అని జవాబిచ్చింది రమ.

''దాని పేరే తెగనీలుగు. గతిలేనిదాన్నా నేను? ఊరికే చెప్తాడా నాకు? నేనిచ్చినంతే తీసుకోవాలి. బట్టె గొంతూ వీడూ గాడిద ఓండ్రపెట్టినట్టు వుంటుంది పాట వింటూంటే. అందానికి నేనూ సంగీతానికి మా బావ అన్నదిట ఒంటె. బావ అంటే గాడిద. రానీ వెధవని. వాడి భరతం పడతా. నా సంగతెరగడు.'' అని వురిమింది.

'' ఇంకరాడు నా బోడి సంగీతం మేష్టరు. నీ కళ్లు చల్లబడతాయి.'' చెల్లెలు కొడుకునెత్తుకు వెళ్లిపోయింది యెదుటనించి.

''మీ అక్కగారిపేరు అసూయా అనసూయా?'' అని లేచాడు శర్మ.

''ఆమెకు ఆరు ఆల్టర్ యిగోలున్నాయి. ఒక్కొక్కటే వదిలించుకోవాలి. టైం పడుతుంది.'' అన్నాడు థెరపిస్టు.

తమ్ముడూ శర్మా అనసూయను ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయారు.

సాయం సంధ్యా సమయంలో తులసికోట ముందు దీపాలుంచింది అనసూయ. రెండు అరటిపళ్లు ఆకులో వుంచి యెదురుగా పెట్టింది.

''నన్ను అసూయా అని పిలుస్తూ నవ్వుతున్నారు. ఆరు ఆల్టర్స్‌ని గెలవాలిట నేను. థెరపిస్టు చెప్పాడు. అవే అంతశ్శత్రువులన్నాడు సచ్చిదానందం. అందరికీ దూరమౌతున్నానట. నా ఆస్తి చూసి నన్ను నా తల్లి అంటిపెట్టుకుని వున్నదట. ఒకసారి ప్రయత్నించి తరిమేసినా మళ్లా యెందుకు ఎటాక్ చేస్తారు శత్రువులు?'' తడి తల కురులు నేలను తాకుతున్నాయి. కొనల నుండి నీటిబొట్లు జారి ప్రవహిస్తున్నాయి. సాదా చీరా రవికా. నగలేమీ లేవు. దివ్య మంగళ విగ్రహం బాసింపీట వేసుక్కూచుని కళ్లు మూసుకుని దణ్ణం పెడుతున్నది అనసూయ.

''మళ్లా మళ్లా ఎటాక్ చేయకుండా పూర్తిగా తరిమేసేదాకా ఆ ఆరు ఆల్టర్ యిగోలతో పోరాటం సలిపి తరిమేయాలి.'' అన్నదంతరాత్మ.